




# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 319

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శుక్రవారం 8 మే 2026


# బెంచ్ మార్క్ సెట్ చేసేలా ఏపీ అభివృద్ధి చెందాలి

- రాష్ట్రంలో రోజుకో ఎంఓయూ... వారానికో శంకుస్థాపన
- వేగంగా పనిచేయాలి... అంతే వేగంగా అభివృద్ధి చూపించాలి
- స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ స్లోగన్‌కే పరిమితం కాకూడదు
- పబ్లిక్ రిలేషన్స్ ఎంత ముఖ్యమో... పబ్లిక్ డెలివరీ అంతే ముఖ్యం
- వినూత్నంగా ఆలోచిస్తే నిధుల కొరతను అధిగమించవచ్చు
- జిల్లా కలెక్టర్ల మధ్య అభివృద్ధిలో పోటీ ఉండాలి
- కాలేజీ రోజుల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ డ్రైవ్ చేశా... ఇప్పుడు ఆ సంస్థను ఏపీకి తెచ్చాం
- 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం






**అమరావతి,కలంకౌంటర్ :** అభివృద్ధి సహా వివిధ రంగాల్లో బెంచ్ మార్క్ సెట్ చేసేలా రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. రెండేళ్ల క్రితం రాష్ట్రం గురించి ఏం మాట్లాడుకునేవారో... ఇప్పుడేం మాట్లాడుకుంటున్నారో ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు. రాష్ట్రాభివృద్ధికి గ్రామస్థాయి ఉద్యోగులను కూడా మోటివేట్ చేసే బాధ్యతను జిల్లా కలెక్టర్లే తీసుకోవాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాకులో రెండు రోజులపాటు జరిగే 7వ కలెక్టర్ల కాన్ఫరెన్సు గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."గత పాలకుల నుంచి రూ. 9.74 లక్షల కోట్ల అప్పులు ప్రభుత్వానికి సంక్రమించాయి. 94 కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి రూ.10 వేల కోట్లను గత ప్రభుత్వం డైవర్ట్ చేసింది. రూ.1.30 లక్షల కోట్ల బిల్లులు కూడా గత పాలకులు మనపై రుద్దారు. గత పాలకుల నిర్వాకం వల్ల రాష్ట్రం గుంతలు పడిన రోడ్లతో విధ్వంసమైంది. అందరి సహకారంతో అలాంటి పరిస్థితి నుంచి గట్టెక్కి... వ్యవస్థలను గాడిలో పెట్టగలిగాం. ప్రజా ప్రతినిధులు-అధికారుల కలయికే ప్రభుత్వం. ప్రజాస్వామ్యంలో సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత. ఇప్పుడు సంక్షేమాన్ని, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాం. జీవన ప్రమాణాలు పెంచేలా పాలన సాగిస్తున్నాం. వివిధ పాలసీలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం. ప్రజల సంతృప్తి స్థాయిని కొలమానంగా పెట్టుకుని పాలన అందిస్తున్నాం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**W-D-WC.. ఇదో సైకిల్..** "అధికారులు క్షేత్రస్థాయిలో బాగా పనిచేసిన చోట ప్రజల నుంచి పాజిటివ్ ఫీడ్ బ్యాక్ వస్తోంది. మంత్రుల నుంచి క్షేత్రస్థాయిలో ఉన్న ప్రజాప్రతినిధి, ఉద్యోగి వరకూ అంతా బాధ్యతగా ఉండాలి. వచ్చిన ఫిర్యాదులు వందశాతం పరిష్కారం కావాల్సిందే. ఆర్థికేతర ఫిర్యాదులను పరిష్కరించకుండా.. కొందరు పైకి కిందకు ఫైళ్లు తిప్పుతున్నారు... వాటిని తక్షణం పరిష్కరించాలి. ఆర్థికపరమైన ఫిర్యాదుల గురించి కూడా విచారణ చేసి సరైన వాటిని పరిష్కరించాలి. 2027 మార్చి నాటికల్లా రెవెన్యూ రికార్డులను పూర్తిగా ప్రక్షాళన కావాలి. సమస్య పరిష్కారం కోసం వినూత్నంగా ఆలోచనలు చేస్తే సుపరిపాలన అందించినట్టే. డబ్బులు లేవనడం కాదు... సంపద సృష్టికి పని చేయాలి... చేద్దాం. వెల్ఫేర్, డెవలప్మెంట్, వెల్త్ క్రియేషన్ అనేది ఓ సైకిల్. అభివృద్ధి లేకుండా సంపద లేదు. సంపద లేకుండా సంక్షేమం లేదు. సూపర్ సిక్స్ పథకాలతో భద్రత, భరోసా కల్పించాం. పీ4తో ఆర్థిక ప్రమాణాలు పెంచుతున్నాం. 26 కొత్త పాలసీలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏపీ అంటే నమ్మకాన్ని కల్పించాం. రాయల్ ఎన్ ఫీల్డ్ వాహనాన్ని డ్రైవ్ చేయడమనేది గర్వంగా ఉండేది. కాలేజీ రోజుల్లో ఎన్ ఫీల్డ్ డ్రైవ్ చేయడాన్ని గొప్పగా ఫీలయ్యేవాళ్లం. అలాంటి రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థను ఏపీకి తెచ్చాం. రూ. 23 లక్షల కోట్ల ఎంఓయూలు చేసుకున్నాం. ఇవి సాకారమైతే 24 లక్షల మేర ఉద్యోగాలు వస్తాయి. గ్రీన్ ఎనర్జీతో పాటు గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా ఉత్పత్తి దిశగా ముందుకు వెళ్తున్నాం. డేటా, ఏఐ, క్వాంటం లాంటి టెక్నాలజీలకు ఏపీ కేంద్రంగా మారనుంది. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి దిగ్గజ కంపెనీలు ఏపీకి వచ్చాయి. రోజుకో ఒప్పందం, వారానికో శంకుస్థాపన చేసుకోగలుగుతున్నాం. వేసవిలో దేశ ప్రజలను చల్లబరిచే ఏసీలు మన రాష్ట్రం నుంచే సరఫరా చేసే పరిస్థితికి వచ్చాం."అని సీఎం వివరించారు.

**బెస్ట్ ప్రాక్టీసెస్ అమలు చేసే కలెక్టర్లే నోడల్ ఆఫీసర్లు..** "గత ప్రభుత్వం అనవసరంగా ప్రైవేటు భూములను నిషేధిత జాబితాలో పెట్టేసింది. కార్యాలయాల చుట్టూ తిరిగి ప్రజలు విసిగిపోతున్న పరిస్థితి ఉంది. భూముల విషయంలో జీరో ఎర్రర్ రికార్డులు తయారు చేయాలి. రోడ్లు, వంతెనలు, ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి. ప్రతీ మూడు నెలలకూ నిర్వహించే కలెక్టర్ల సదస్సు మంత్రులు, అధికారులకు క్వార్టర్లీ పరీక్షలు. ప్రజల కోసం పనిచేసే వ్యక్తులు ఎవరికీ భయపడాల్సిన అవసరమే లేదు. పబ్లిక్ రిలేషన్స్ ఎంతో ముఖ్యమో... పబ్లిక్ డెలివరీ కూడా అంతే ముఖ్యం. లాస్ట్ మైల్ లో ఉండే ఉద్యోగిని కూడా మోటివేట్ చేస్తే అద్భుతంగా పని చేయగలరు. విద్యుత్ రంగంలో

## ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్లు

- బిజినెస్ రిఫార్మర్ అవార్డు సాధించిన ముఖ్యమంత్రికి స్టాండింగ్ ఓవేషన్ తో గౌరవం
- మరిన్ని పెట్టుబడులు వచ్చేందుకు ఇలాంటి అవార్డులు రావాలి: సీఎం చంద్రబాబు
- ఈ అవార్డును టీమ్ ఏపీకి అంకితం: ముఖ్యమంత్రి



**అమరావతి,కలంకౌంటర్ :** బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ – – 2025 అవార్డు సాధించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ అభినందనలు తెలిపింది. గురువారం కలెక్టర్ల కాన్ఫరెన్స్ సమావేశానికి హాజరైన సీఎం చంద్రబాబుకు మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."మంత్రులు, సీఎస్ మొదలుకుని... గ్రామ స్థాయి అధికారి వరకు పని చేయడం వల్లే ఈ అవార్డు దక్కింది.బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ పురస్కారం మనందరి సమిష్టి కృషి. రెండేళ్ల క్రితం రాష్ట్రం గురించి ఏం మాట్లాడారు... ఇప్పుడు ఏం మాట్లాడుకుంటున్నారు అనే దానికి ఈ అవార్డు ఉదాహరణ. గతంలో ఇలాంటి అవార్డులు తీసుకోవడానికి ఇష్టపడేవాడిని కాదు... కానీ ఇప్పుడు ఇలాంటి అవార్డులు మరిన్ని రావాలని కోరుకుంటున్నాను. ఎన్ని అవార్డులు వస్తే... మన రాష్ట్రానికి అంత గుర్తింపు దక్కుతుంది... మరిన్ని పెట్టుబడులు వస్తాయి. అందుకే మరిన్ని అవార్డులను మనం సాధించాలని కోరుకుంటున్నాను. ఈ అవార్డును టీమ్ ఏపీకి అంకితం చేస్తున్నాను."అని ముఖ్యమంత్రి చెప్పారు.

## ఇక విద్యా శాఖ మొత్తానికీ ఒకే డ్యాష్‌బోర్డు: మంత్రి నారా లోకేష్,కీలక ప్రకటన



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్ర విద్యాశాఖ మొత్తాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకొస్తూ, ఒకే డ్యాష్‌బోర్డును రూపొందించబోతున్నట్టు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కీలక ప్రకటన చేశారు. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వంకు అన్ని విభాగాల పనితీరును దీని ద్వారా పర్యవేక్షించనున్నట్టు తెలిపారు. అమరావతి సచివాలయంలో జరుగుతున్న 7వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. "విద్యాశాఖకు సంబంధించి ఒక సమగ్రమైన కేపీఐ (కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్) డ్యాష్‌బోర్డును రూపొందించాం. విద్యార్థుల హాజరు, డ్రాపవుట్లు, మధ్యాహ్న భోజనం వంటి కీలక అంశాలను ఇందులో పొందుపరిచాం. నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో ఈ డ్యాష్‌బోర్డు కలెక్టర్లకు ఎంతగానో ఉపయోగపడుతుంది" అని వివరించారు. 'డెమాక్రటైజేషన్ ఆఫ్ డేటా' తమ లక్ష్యమని, త్వరలోనే ఈ డ్యాష్‌బోర్డును ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ఉత్తమ విధానాలు (బెస్ట్ ప్రాక్టీసెస్) అమలు చేసేందుకు జిల్లాల కలెక్టర్లను మెంటార్లుగా నియమిస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా, స్కూళ్లలో స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు మెంటార్‌గా కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్‌ను నియమిస్తున్నట్టు తెలిపారు. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ నిర్ణయాలు స్పష్టం చేస్తున్నాయి.

## వ్యవసాయ, ఆక్వా వ్యర్థాలతో అద్భుత సంపద సృష్టి..

- పశ్చిమ గోదావరి జిల్లా 'సర్క్యులర్ ఎకానమీ బ్లూప్రింట్' ను ప్రశంసించిన సి.ఎం.



**అమరావతి, కలంకౌంటర్ :** 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేసిన ప్రజెంటేషన్ "సర్క్యులర్ ఎకానమీ బ్లూప్రింట్" అందరి దృష్టినీ విశేషంగా ఆకర్షించింది.వ్యవసాయం మరియు ఆక్వా రంగాల ద్వారా వచ్చే వ్యర్థాలను పర్యావరణానికి ముప్పుగా కాకుండా, అత్యంత విలువైన బయో-ఉత్పత్తులుగా, సంపదగా ఎలా మార్చవచ్చో ఆమె తన ప్రజంటేషన్‌లో కళ్లకు కట్టినట్లు వివరించారు. పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయం పరంగా ఎంతో సంపన్నమైనదని, 2026 నాటికి తలసరి ఆదాయం రూ. 3.5 లక్షలు దాటబోతోందని, కానీ పారిశ్రామిక రంగం మాత్రం కేవలం 16 శాతం వాటాతో వెనుకబడి ఉందన్న వాస్తవాన్ని ఆమె సభ ముందు ఉంచారు. కేవలం వ్యవసాయంపైనే ఆధారపడకుండా, జిల్లాను పారిశ్రామికంగా కూడా అభివృద్ధి చేయడానికి ఈ వ్యర్థాల నుంచి సంపద సృష్టించే (వేస్ట్ టు వెల్త్) మోడల్ ఒక గొప్ప పరిష్కారమని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా వరి, ఆక్వా, పశుసంపద, మరియు కోకో.. ఈ నాలుగు రంగాల్లో వ్యర్థాలను ఎలా వాడు కుంటున్నారో కలెక్టర్ నాగరాణి సవివరంగా వెల్లడించారు.వరిని కేవలం ఆహార పంటగానే కాకుండా పారిశ్రామిక ముడిసరు కుగా భావిస్తున్నామని, వరి పొట్టు నుంచి విద్యుత్ మరియు సిలికా జెల్, తవుడు నుంచి రైస్ బ్రాన్ ఆయిల్, అలాగే నూకలు మరియు గడ్డి నుంచి ఇథనాల్ తయారు చేసేలా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఇక ఆక్వా రంగంలో రోజూ దాదాపు 30 నుంచి 40 టన్నుల వరకు వృథాగా పోతున్న చేపలు, రొయ్యల వ్యర్థాలతో (పొలుసులు, చర్మం తదితర) విలువైన ఉత్పత్తులు తయారు చేయడం ద్వారా, ప్రస్తుతం ఉన్న 10 కోట్ల రూపాయల ఎగుమతులను ఏకంగా 50 కోట్ల రూపాయలకు (400 శాతం వృద్ధి) పెంచే అవకాశం ఉందన్నారు. పశువుల పేడ ద్వారా బయోగ్యాస్ తయారు చేసి వంటగ్యాస్ కష్టాలు తీర్చడంతో పాటు, నాణ్యమైన సేంద్రియ ఎరువులు అందించేందుకు రాబోయే రెండేళ్లలో జిల్లాలో 40 వేల బయోగ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేయబోతున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. వ్యర్థాల నిర్వహణతో పాటు స్థానికంగా మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని చెబుతూ, కోకో పంట ద్వారా డ్వాక్రా మహిళలు సొంతంగా తయారు చేస్తున్న చాక్లెట్ బ్రాండ్లను కలెక్టర్ సభకు పరిచయం చేశారు. తాడేపల్లిగూడెం మండల సమాఖ్య ఆధ్వర్యంలో తయారవుతున్న "చోకో టేల్స్", ఉండి మండలం మహాదేవపట్నం గ్రామంలో తయారవుతున్న "ది స్లో బీన్" చాక్లెట్లు ఎంతో నాణ్యతతో ఏడాదికి లక్షల్లో టర్నోవర్ సాధిస్తున్నాయని, ప్రభుత్వ కార్యక్రమాల్లో కూడా వీటినే వాడాలని ఆమె సూచించారు. ఈ సర్క్యులర్ ఎకానమీ విధానాలకు క్షేత్రస్థాయిలో అద్భుతమైన స్పందన వస్తోందని, ఇటీవల భీమవరంలో నిర్వహించిన సదస్సులో 500 మందికి పైగా మిల్లర్లు, స్థానిక ప్రతినిధులు ముందుకు వచ్చి దాదాపు రూ. 60 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమయ్యారని ఆమె వివరించారు. పారిశ్రామిక అభివృద్ధి కోసం కేవలం ఒకే చోట కాకుండా వికేంద్రీకరణ పద్ధతిలో తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం నియోజకవర్గాల్లో భూసమీకరణ ద్వారా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. కేవలం వ్యవసాయ ఉత్పత్తులను పండించే జిల్లాగా మిగిలిపోకుండా, వ్యర్థాల్లేని (జీరో-వేస్ట్) పారిశ్రామిక కేంద్రంగా పశ్చిమ గోదావరి జిల్లా మారుతోందని, ఈ అద్భుతమైన బ్లూప్రింట్ భవిష్యత్తులో దేశానికే ఒక ఆదర్శ నమూనాగా నిలుస్తుందని కలెక్టర్ నాగరాణి తెలిపారు.



# 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం

## 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో ఆకట్టుకున్న ఛాంపియన్ ఫార్మర్స్ బుక్ లెట్.




**అమరావతి,కలంకౌంటర్ :** ఛాంపియన్ ఫార్మర్స్ పేరుతో బెస్ట్ పాలసీని గతంలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో ప్రజెంట్ చేసిన నెల్లూరు కలెక్ట్ హిమాన్షు శుక్లా. ఛాంపియన్ ఫార్మర్స్ అమలు విధానాన్ని వివరిస్తూ బుక్ లెట్ రూపొందించిన నెల్లూరు కలెక్టర్. రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా ఛాంపియన్ ఫార్మర్స్ పాలసీని అమలు చేసిన హిమాన్షు శుక్లా. ఛాంపియన్ ఫార్మర్స్ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేలా మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం.

## నేను కాదు... మనం

**క్షేత్ర స్థాయి ఉద్యోగుల అనుభవాన్ని వినియోగించుకోవాలి**
**సింగపూర్ ఉత్తమ విధానాలను ఓ జిల్లాలో అమలు చేద్దాం**
**టూరిజం అభివృద్ధి చేసిన జిల్లాకు అత్యధిక ఆదాయం**
**7వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు**

అమరావతి,**కలంకౌంటర్ :**టీమ్ వర్క్‌తోనే అభివృద్ధి జరుగుతుందని... నేను అని కాకుండా.. మనం అనే ఆలోచన విధానం అందరిలో రావాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఇక నుంచి తాను కూడా నేను అనే పదాన్ని పక్కన పెట్టి మనం అనే పదాన్ని ఉపయోగిస్తానని సీఎం చంద్రబాబు వెల్లడించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన 7వ కలెక్టర్ల కాన్ఫరెన్సులో వివిధ అంశాలపై చర్చ జరిగింది. దీంట్లో భాగంగా జీఎస్డీపీ గ్రోత్, జిల్లాల వారీగా జీఎస్డీపీ అంచనాలు, సింగపూర్ దేశంలో మంత్రులకు ట్రైనింగ్ వంటి అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."నేర్చుకోవటం అనేది నిరంతర ప్రక్రియ, అత్యుత్తమ విధానాలు ఎక్కడున్నా అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. సింగపూర్ దేశంలో అనుసరిస్తున్న పాలనా విధానాలు అక్కడి ప్రజల విశ్వాసాన్ని దక్కించుకున్నాయి. సింగపూర్ అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను తీసుకుని ఓ జిల్లాను మోడల్ గా అభివృద్ధి చేద్దాం. సింగపూర్ విధానాల అమలుకు 90 రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేసి పర్యవేక్షణ చేపట్టాలి. సింగపూర్ దేశంలో నేను కాదు.. మనం అనే విధానాన్ని అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో కూడా నేను కాదు మనం అనే విధానాన్నే అవలంభిద్దాం. రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చినా... సంక్షేమ, అభివృద్ధి జరగుతున్నా.. అందరి కృషి వల్లే సాధ్యమైంది. కలిసి కట్టుగా పని చేస్తే... ప్రతి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఓన్ చేసుకుంటే ప్రభుత్వం మరింత విజయవంతంగా సేవలు అందించగలదు. నేను కాదు మనం అనే విధానాన్ని నాతో ప్రారంభిస్తున్నా. ప్రతి ఒక్కరూ ఇదే తరహాలో ఆలోచన చేయాలి. జీఎస్డీపీ విషయంలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో ప్రజలపై ప్రభావం చూపిస్తాయి. గిరిజన ప్రాంతంలో ఉంటూనే పార్వతీపురం, అల్లూరి జిల్లాల్లో అభివృద్ధి వేర్వేరుగా ఉంది. అల్లూరి జిల్లాలో కాఫీ పంటకు విలువ జోడింపుతో జీఎస్డీపీ ఎక్కువగా ఉంది. అభివృద్ధిపై దృష్టి సారించాలి... ప్రగతి సాధనలో కీలకంగా వ్యవహరించాలి. సర్వీస్ సెక్టార్ మరింతగా పెరగాలి. దేశ జీడీపీలో ఏపీ 10 శాతం మేర వ్యవసాయ ఉత్పత్తుల వాటాను కలిగి ఉంది. కొన్ని జిల్లాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ ఉన్నాయి.. వాటికి సంబంధించిన ప్లాంట్లు వస్తే మరింత అభివృద్ధికి ఆస్కారం ఉంది. జీఎస్డీపీ గ్రోత్ విషయంలో కలెక్టర్లు ఎలా పని చేస్తున్నారనే అంశంపై అధ్యయనం చేస్న?న్నాం. నూతన ఆవిష్కరణలతో అభివృద్ధి ఎలా సాధించాలన్నదానిపై జిల్లా కలెక్టర్లు ఆలోచనలు చేయండి. అన్నమయ్య జిల్లా కలెక్టరే దీనికి ఉదాహరణ. బెస్ట్ పాలసీల అమల్లో కలెక్టర్లు పోటీలు పడాలి. రాష్ట్ర స్థాయిలో కలెక్టర్లకు పోటీ పెట్టినట్టే... జిల్లా స్థాయిలో నియోజకవర్గాల మధ్య పోటీ పెట్టండి. ఫీల్డ్ లెవల్ ఆఫీసర్లకు చాలా అనుభవం ఉంటుంది.. వాళ్ల దగ్గర చాలా సమాచారం ఉంటుంది. క్షేత్ర స్థాయి అధికారులను సమర్ధంగా వినియోగించుకుంటే అభివృద్ధి వేగంగా జరుగుతుంది.. సంక్షేమం చక్కగా అందుతుంది... వినూత్నమైన ఆలోచనలను అమలు చేసేందుకు అవకాశం దక్కుతుంది. సూర్యలంక, మంగినపూడి, విశాఖ, శ్రీకాకుళం, మైపాడు తదితర ప్రాంతాల్లో బీచ్ ఫ్రంట్లు అభివృద్ధి చేస్తే స్థానికులకు అవకాశాలు పెరుగుతాయి. కొత్త జాతీయ రహదారులు కొత్త అవకాశాల్ని సృష్టిస్తాయి... లాజిస్టిక్స్ హబ్ లను ఏర్పాటు చేసుకోవచ్చు... టౌన్ షిప్ లను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. విజన్ యూనిట్లను జిల్లా కలెక్టర్లు సమర్ధంగా వినియోగించుకోవాలి. గతంలో పెద్ద జిల్లాల్లో 21 నియోజకవర్గాలను పర్యవేక్షించాల్సి వచ్చేది. కలెక్టర్లు జిల్లా పర్యటనకు వెళ్తే ప్రయాణానికే ఓ పూట పట్టేది. ఇప్పుడు ప్రతీ జిల్లా కలెక్టర్ పరిధిలో కేవలం 7 అసెంబ్లీ నియోజకవర్గాలు మాత్రమే ఉన్నాయి. గతంతో పోల్చుకుంటే టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. గతానికంటే మెరుగైన పనితీరు కనబర్చడానికి... అభివృద్ధి చేయడానికి, సంక్షేమం అందించడానికి ఇప్పుడు కలెక్టర్లకు అవకాశాలు ఎక్కువ."అని సీఎం వివరించారు.










(మొదటి పేజీ తరువాయి)

సంస్కరణలు తెచ్చి 0.30 పైసల మేర కొనుగోలు వ్యయం తగ్గించాం. మరో 0.30 పైసలు త్వరలోనే తగ్గిస్తాం... తొలిసారి ట్రూ డౌన్ చేయగలిగాం. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాం... ఆన్ లైన్ లో పన్నులు కట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పదో తరగతి టాపర్ల ఫోటోలతో యాడ్ ఇచ్చాం. ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని చాటి చెప్పాం. డిమాండ్ డ్రివెన్ అగ్రికల్చర్, ఆక్వా కల్చర్ దిశగా అడుగులు వేస్తున్నాం. అన్ని రంగాల్లో... అన్ని వ్యవస్థల్లో ఏపీ పనితీరు బెంచ్ మార్క్ గా మారాలి. జిల్లాలు, కలెక్టర్ల మధ్య అభివృద్ధిలో పోటీ ఉండాలి. జిల్లాల్లో అమలు చేసే ఉత్తమ పద్దతులను బెస్ట్ ప్రాక్టీసెస్ మిగతా జిల్లాల్లోనూ అమలు చేస్తాం... ఆ కలెక్టర్లనే వాటికి నోడల్ ఆఫీసరుగా పెడతాం. సీయింగ్ ఇజ్ బిలీఫ్ అనే విధానంలో 3 రోజుల కార్యదర్శులు, 6 రోజులు హెచ్వోడీలు, 8 రోజులు కలెక్టర్లు ఫీల్డ్ కు వెళ్లాలి. సామాజిక మాధ్యమాలను సక్రమంగా వినియోగించుకోవాలి. రిజల్ట్ ఓరియేంటేషనుతో ప్రతి ఒక్కరూ పని చేయాలి. ఆఫీస్ టెల్స్ యూ డేటా... ఫీల్డ్ టెల్స్ యూ ట్రూత్.. దీన్ని గుర్తు పెట్టుకోవాలి. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ ఈజ్ నాట్ స్లోగన్... గవర్నెన్స్ డిసైడ్స్ ద స్పీడ్ ఆఫ్ గ్రోత్. ఫైల్స్ షుడ్ నాట్ మూవ్... రిజల్ట్స్ షుడ్ మూవ్.. అప్పుడే ప్రజలకు మంచి సేవలు అందుతాయి."అని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. 7వ కలెక్టర్ల కాన్ఫరెన్సులో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

# 100 శాతం కృషి... 100 శాతం ఫలితాలు

**-23 నెలల్లో ప్రజా ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను కలెక్టర్ల కాన్ఫరెన్సులో వివరించిన సీఎం చంద్రబాబు**

**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్ర సచివాలయంలో జరిగిన 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో ప్రారంభోపన్యాసం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లకు.. అధికారులకు వివిధ అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎంత కష్టపడి పథకాలను.. కార్యక్రమాలను అమలు చేస్తున్నామనే విషయాన్ని ముఖ్యమంత్రి వివరించారు. జరుగుతోన్న పరిణామాలను గమనిస్తూ.. రాష్ట్రంలోని పరిస్థితులను అంచనా వేసుకుంటూ ప్రభుత్వం పాలన ఏ విధంగా సాగిస్తుందోననే అంశాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు. ఈ క్రమంలో 23 నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన దాదాపు 100 పథకాలు, కార్యక్రమాలు వంటి వాటిని సీఎం వివరించారు.

**దాదాపు 100కు పైగా పథకాలు, ప్రభుత్వ సేవలు, విజయాలు వివరించిన ముఖ్యమంత్రి..** తల్లికి వందనం : రూ.10,090 కోట్లు చెల్లింపు, 7.27 లక్షల మంది విద్యార్థులకు సాయం స్త్రీ శక్తి : ఆగస్ట్ 15 నుంచి పథకం ప్రారంభం, మహిళలు 63.61 కోట్ల ప్రయాణాలు (మే 6 వరకు) విభిన్న ప్రతిభావంతుల కోసం దివ్యాంగ శక్తి పథకం ప్రారంభం -- 20.51 లక్షల ప్రయాణాలు దీపం 2 పథకం కింద 4 కోట్ల సిలిండర్లు. 269 అన్న క్యాంటీన్‌లు - 9.15 కోట్ల భోజనాలు (మే 6 నాటికి) అన్నదాత సుఖీభవ : 46 లక్షల మంది రైతులకు 3 విడతలు కలిపి రూ.8,985కోట్లు జమ ఎన్టీఆర్ భరోసా : ఇప్పటివరకు రూ.63 వేలకోట్లకు పైగా పెన్షన్ల కోసం వ్యయం... మత్స్యకార సేవలో : ఏడాదికి 20 వేల చొప్పున 1.25 లక్షల మందికి రూ.250 కోట్లు మత్స్యకారుల కోసం జీ.వో 217 రద్దు -- నీటి వనరులపై హక్కు ఆటో డ్రైవర్ల సేవలో : ఏడాదికి రూ.15,000... రూ.436 కోట్లు జమ, 2.90 లక్షల మందికి లబ్ది గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపుల కేటాయింపు వివాదాలకు తావివ్వకుండా ఎస్సీ వర్గీకరణ స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు ఈ ఏడాది మైనారిటీ సంక్షేమానికి రూ. 3,670 కోట్లు వ్యయం 8,427 మంది పాస్టర్లకు నెలకు రూ.5,000 చొప్పున గౌరవ వేతనంకు రూ.51 కోట్లు ఇమామ్‌లకు నెలకు రూ.10,000 మౌజన్లకు రూ.5,000 చొప్పున ఏడాదికి రూ.90 కోట్లు వక్ఫ్ బోర్డు పునరుద్దరణ -- అన్ని వర్గాలకు ప్రాధాన్యం పురోహితులకు నెలకు రూ.15,000కు వేతనాల పెంపు నాయీ బ్రాహ్మణులకు నెలకు రూ.25,000కు వేతనాల పెంపు మగ్గాలున్న చేనేతలకు 200, మరమగ్గాలున్న చేనేతలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు జూనియర్ లాయర్లకు రూ.10,000 గౌరవ వేతనం మెగా డీఎస్సీ... ముఖ్యమంత్రి తొలి సంతకం. 15,941 టీచర్ పోస్టుల భర్తీ 5,757 కానిస్టేబుల్ పోస్టుల నియామకం పూర్తి, రూ.4,500 నుంచి రూ.12,500కు స్టైఫండ్ పెంపు 10 వేలకుపైగా పోస్టులతో జాబ్ కేలండర్ విడుదల భవిష్యత్ నగరంగా అమరావతి నిర్మాణం -- శాశ్వత, ఏకైక రాజధానిగా కేంద్రం గెజిట్ ఉచిత ఇసుక విధానంతో నిర్మాణ రంగానికి ఊతం జె బ్రాండ్స్ రద్దు -- నాణ్యమైన మద్యం సరఫరా- బెల్ట్ షాపుల నియంత్రణ అంగన్‌వాడి కార్యకర్తలు, ఆశాలకు గ్రాట్యుటీ అమలు బాలింతలకు మళ్లీ ఎన్టీఆర్ బేబీ కిట్లు చెత్త పన్ను రద్దు - దాదాపు 84 లక్షల టన్నుల లెగసీ వేస్ట్ తొలగింపు ప్రతీ నెల 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'. డోర్ టు డోర్ కలెక్షన్. స్వచ్ఛ రథాలు రూ.861 కోట్లతో 20,060 కి.మీ పాత్ హోల్ ఫ్రీ రోడ్లు- రూ.2500 కోట్లతో రహదారుల నిర్మాణం విజయవాడ -- మచిలీపట్నం 6 లైన్ రోడ్డుకు ఆమోదం మూలపేట - వైజాగ్ - కాకినాడ బీచ్ రోడ్, నాగ్పూర్ -- అమరావతి హైవే నిర్మాణం హైదరాబాద్ - అమరావతి - చెన్నై బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు పచ్చజెండా రికార్డు స్థాయిలో బెంగుళూరు - అమరావతి హైవే పనులు గాడిలో పంచాయతీరాజ్ వ్యవస్థ. పల్లె పండుగ ద్వారా గ్రామాల్లో 4,000 కి.మీ. రోడ్ల నిర్మాణం అడవితల్లి బాటతో గిరిజన తండాలకు రోడ్ల నిర్మాణం, శివారు గ్రామాలకు 4జీ నెట్వర్క్ కొత్తగా 28 పాలసీలు, పరిశ్రమలకు రాయితీలకు దేశంలో తొలి సారి ఎస్క్రో ఖాతాలు దేశంలో వచ్చిన పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకి -- బిజినెస్ రిఫార్మర్ అవార్డు సీఐఐ సమ్మిట్ 538 ఒప్పందాలు. రూ.11.38 లక్షల కోట్ల పెట్టుబడులు, 13.95 లక్షల ఉద్యోగాలు 17 ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.11,37,222 పెట్టుబడులు, 10,01,147 లక్షల ఉద్యోగాలు175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు, వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ విశాఖ ఐటీ హబ్ -- టీసీఎస్ ప్రారంభం, కాగ్నిజెంట్‌కు శంకుస్థాపన తిరుమల సహా దేవాలయాల సేవల్లో పెనుమార్పులు, 15 ప్రధాన ఆలయాల్లో నిత్యాన్నదానాలు 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల, 90కిపైగా సీఎస్ఎస్ పథకాల పునరుద్ధరణ ప్రతీ ఇంటికి అమరజీవి జలధార పేరుతో మంచినీటి కుళాయి కనెక్షన్లు. 100 రోజుల్లోనే హంద్రీనీవా కాలువ విస్తరణ రాయలసీమలో అన్ని చెరువులు, ప్రాజెక్టులు నింపి సాగు, తాగునీరు సాగునీటి ప్రాజెక్టులకు 23 నెలల్లో రూ.24 వేల కోట్లు ఖర్చు శరవేగంగా పోలవరం నిర్మాణం -- డయాఫ్రం వాల్ పూర్తి - విశాఖకు నీళ్లు రూ.2 వేల కోట్లతో పోలవరం నిర్వాసితులకు పునరావాసం వెలిగొండ ప్రాజెక్టుకు రూ.571 కోట్లు వ్యయం -- జులై నాటికి తొలి దశ పూర్తి తుంగభద్ర గేట్ల మరమ్మతులు పూర్తి - ఏపీ వాటాగా రూ.55 కోట్ల కేటాయింపు చింతలపూడి ఎత్తిపోతల అనుమతుల్లో పురోగతి సాగు నీటి ప్రాజెక్టుల మరమ్మతులకు రూ.610 కోట్లతో మరమ్మతులు రాష్ట్ర వ్యాప్తంగా కాలువల నిర్వహణ, పూడికలతీత, లాకుల మరమ్మతులకు నిధులు మళ్లీ సాగునీటి సంఘాల కీలక పాత్ర- 6,047 సాగునీటి సంఘాలకు ఎన్నికలు రాజధానిలో క్వాంటం వ్యాలీ భవనాలకు శంకుస్థాపన క్వాంటమ్ రిఫరెన్స్ ఫెలిసిటీ సెంటర్ ప్రారంభం కాకినాడలో ఏఎమ్ గ్రీన్ అమోనియాకు శంకుస్థాపన..రెండేళ్లలో గ్రీన్ అమోనియ ఎగుమతి రికార్డ్ స్థాయిలో ధాన్యం సేకరణ, 24 గంటల్లో డబ్బులు జమ మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా పొగాకు, మామిడి, కోకో, ఉల్లి పంటలకు రూ.1,100 కోట్లు రాష్ట్ర ఆర్థికాభివృద్ధి డబుల్ డిజిట్ గ్రోత్ 11.28 శాతం.... పెరిగిన మూలధన వ్యయం రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు, నాలా చట్టం, ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు గేట్స్ ఫౌండేషన్, టాటా సంజీవనితో... డిజి హెల్త్ కేర్, యూనివర్సల్ హెల్త్ పాలసీ విద్యా వ్యవస్థలో పెనుమార్పులు - మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాల సాధన -- ముస్తాబు వంటి వినూత్న కార్యక్రమాలు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, సర్వేపల్లి రాధాకృష్ణ కిట్స్, పారదర్శకంగా బదిలీలు గాడిన పడిన విద్యుత్ రంగం -- ట్రూ డౌన్ కు అంకురార్పణ




యూనిట్ కాస్ట్ 0.30 పైసలు తగ్గింపు -- మరో 0.30 పైసలు తగ్గింపునకు లక్ష్యం ఈవీలకు ప్రోత్సాహం -వాహనాలకు గ్రీన్ టాక్స్ తగ్గింపు 90 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు ఒప్పందాలు 20 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్ సోలార్ రూఫ్ టాప్ లో బీసీలకు రూ.20 వేల అదనపు సాయం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్, డేటా డ్రివెన్ డెసిషన్స్, విపత్తుల నిర్వహణ, పీ4 ద్వారా పేదరిక నిర్మూలన -- 2 లక్షల కుటుంబాలకు చేయూత మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 1035 సేవలు విశాఖపట్నం, అమరావతి, తిరుపతి కేంద్రంగా 3 రీజియన్ల అభివృద్ధి

కేంద్రంతో సమన్వయం - దాదాపు 90 కేంద్ర పథకాల పునరుద్దరణ రుణాల రీ షెడ్యూల్ తో వడ్డీ తగ్గింపు రాష్ట్రానికి సెమీ కండక్టర్, డిఫెన్స్ పరిశ్రమలు

విశాఖ స్టీల్ ప్లాంట్ కు రూ.11440 కోట్లతో కేంద్ర సాయం వేగంగా పోర్టులు, ఫిషింగ్ హార్బర్ ల నిర్మాణం జూలై నాటికి భోగాపురం విమానాశ్రయం పూర్తి లక్ష కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు -- విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటుకు గెజిట్ ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాల ఏర్పాటు లక్ష మంది మహిళా పారిశ్రామిక వేత్తలు -- మరో 5 లక్షల మంది లక్ష్యం శ్రీ సిటీలో రూ. 5 వేల కోట్లతో ఎల్ జీ, రూ.1000 కోట్లతో క్యారియర్ ఏసీ పరిశ్రమకు శంకుస్థాపన రూ.5,400కోట్లతో రెన్యూ ఎనర్జీ సంస్థకు శంకుస్థాపన అనకాపల్లిలో రూ.1.35 లక్షల కోట్లతో ఆర్సెలార్ రూ ప్లాంట్‌కు శంకుస్థాపన విశాఖపట్నంలో రూ.1.35 లక్షల కోట్లతో గూగుల్ ఏఐ డేటా సెంటర్ హబ్‌కు శంకుస్థాపన రూ.1 లక్షల కోట్లతో రిలయన్స్ డేటా సెంటర్ ఏర్పాటుకు అడుగులు 23 నెలల్లో 5.5 లక్షల ఇళ్లు పేదలకు అందజేత..మరో 5 లక్షల ఇళ్ల నిర్మాణానికి సంకల్పం 50 వేల మంది కాంట్రాక్టర్లకు రూ.2 వేల కోట్లు చెల్లింపులు ఉద్యోగులకు 23 నెలల్లో రూ.21 వేల కోట్ల బకాయిలు చెల్లింపులు అగ్నిమాపక శాఖ బలోపేతం -- రూ. 34 కోట్లతో కొత్త పరికరాలు, వాహనాలు తగ్గిన క్రైమ్ రేట్ -- మహిళల భద్రతకు ప్రాధాన్యత గంజాయి-డ్రగ్స్ పై ఉక్కుపాదం- ఈగల్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు

# పబ్లిక్ పార్టిసిపేషన్ తో పాటు పబ్లిక్ ట్రస్ట్ కూడా ముఖ్యం - హోం మంత్రి వంగలపూడి అనిత

## -7వ కలెక్టర్ల సదస్సులో సింగపూర్ పర్యటన అనుభవాలు పంచుకున్న హోం మంత్రి



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన 7వ కలెక్టర్ల సదస్సులో గురువారం నాడు హోం మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత నాూ+జు కార్యక్రమం కింద చేసిన సింగపూర్ పర్యటన అనుభవాలను సభతో పంచుకున్నారు. ఆ పర్యటనను కొం దరు ఎంజాయిమెంట్ ట్రిప్ అని పిలిచారని, కానీ అది వాస్తవానికి దూరమైన మాటని ఆమె స్పష్టం చేశారు. విమానం 4 గంటలకు ఉంటే తాము 2 గంటలకే క్లాస్‌రూమ్‌లో కూర్చున్నామని, ఒక్క రోజు కూడా విశ్రాంతిగా గడపలేదని ఆమె చెప్పారు. ప్రతి క్షణం నేర్చుకోవ డానికే వినియోగించామని ఆమె స్పష్టం చేశారు. సింగపూర్ అంతటా ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారి దార్శనికత కనిపించిందని మంత్రి అన్నారు. ఎక్కడికి వెళ్ళినా సీఎం గారి నీడ కనపడుతూనే ఉందని, సింగపూర్ అనుసరిస్తున్న విధానాలను ఆయన ఎప్పటి నుంచో మాట్లాడుతున్నారని ఆమె పేర్కొన్నారు. 1996లోనే ముఖ్యమంత్రి జన్మభూమి కమిటీల ద్వారా పబ్లిక్ పార్టిసిపేషన్ గురించి మాట్లాడారని, ప్రజలు ప్రభుత్వంతో కలిసి పని చేయాలనే ఆలోచన అప్పటి నుంచే ఆయనకు ఉందని ఆమె గుర్తు చేశారు. అయితే సింగపూర్ పబ్లిక్ పార్టిసిపేషన్‌కు మించి పబ్లిక్ ట్రస్ట్ మీద దృష్టి పెట్టిందని మంత్రి వివరించారు. అక్కడ కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ చాలా బలంగా ఉందని, ఏదైనా పథకం తీసుకొచ్చే ముందే ప్రజలకు చెప్పి సిద్ధం చేస్తారని ఆమె తెలిపారు. జరగబోయే మార్పులను ముందే అర్థమయ్యేలా చేయడం వల్ల ప్రజలు వ్యతిరేకించకుండా సహకరిస్తారని ఆమె అన్నారు. ప్రభుత్వం ఏదైనా చేయాలంటే ముందు ప్రజల నమ్మకం సంపాదించాలని, అది రాత్రికి రాత్రి సాధ్యం కాదని ఆమె స్పష్టం చేశారు. సహజ వనరులు లేకుండా కూడా అన్నీ సొంతంగా సృష్టించుకుని సింగపూర్ ఎదిగిన తీరు అత్యంత స్ఫూర్తిదాయకంగా ఉందని మంత్రి అన్నారు. నీళ్ళు కూడా శుద్ధి చేసుకుని తాగే దేశం ఇంత ఎత్తుకు ఎదిగిందంటే... వనరులు ఉన్న మన రాష్ట్రం ఎందుకు వెనకబడాలని ఆమె ప్రశ్నించారు. యువత క్రమశిక్షణ విషయంలో సింగపూర్ అనుసరిస్తున్న పద్ధతి గురించి మాట్లాడుతూ, అక్కడ o2 తర్వాత యువతకు డిఫెన్స్ కోచింగ్ ఇస్తున్నారని మంత్రి తెలిపారు. ఇది కేవలం దేశ రక్షణకు కాదని, క్రమశిక్షణ, బాధ్యత, దేశంపై ప్రేమ అలవడేలా చేయడానికని ఆమె చెప్పారు. ఈ దశ దాటిన యువత జీవితంలో ఏ పని చేసినా బాధ్యతగా చేస్తారని అన్నారు. మన రాష్ట్రంలో ఇలాంటి మెకానిజమ్ ఎలా తీసుకురావాలో కలెక్టర్లు ఆలోచించాలని ఆమె పిలుపు ఇచ్చారు. హోం మంత్రిగా తనను అత్యంత ఆకర్షించింది అక్కడి శాంతిభద్రతల వ్యవస్థ అని ఆమె చెప్పారు. సింగపూర్‌లో క్రైమ్ రేట్ చాలా తక్కువని, దానికి కారణం పోలీసుల సంఖ్య కాదని వివరించారు. అక్కడి అధికారులు చెప్పిన మాట తనను ఎంతగానో ప్రభావితం చేసిందని, "20 వేల మంది పోలీసులు ఉన్నా 20 లక్షల మంది పోలీసింగ్ చేస్తారని" వారు అన్నారని మంత్రి తెలిపారు. అంటే ప్రజలనే పోలీసులుగా తీర్చిదిద్దారని, శాంతిభద్రతలు తమ బాధ్యత అని ప్రజలకు అనిపించేలా చేయగలిగారని ఆమె అన్నారు. ఆ వ్యవస్థను మరింత వివరిస్తూ.. అక్కడ ఏదైనా తప్పు జరిగితే 100కు డయల్ చేయాల్సిన అవసరం లేదని, Google లింక్ ద్వారా కంప్లయింట్ పెట్టవచ్చని మంత్రి తెలిపారు. అందులో ప్రత్యేకత ఏమిటంటే బాధితులు మాత్రమే కాదు, సంఘటన చూసిన ఏ పౌరుడైనా కంప్లయింట్ నమోదు చేయవచ్చని, వారి సమాచారం గోప్యంగా ఉంచడం వల్ల ప్రజలు భయపడకుండా ముందుకు వస్తున్నారని ఆమె వివరించారు. న్యాయ వ్యవస్థలో సింగపూర్ అనుసరిస్తున్న అప్పీళ్ళ విధానం కూడా చాలా ఆదర్శంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. మన దగ్గర అప్పీల్ చేయడం చాలా సులభంగా ఉండటం వల్ల అదే కేసులు పదేళ్ళు, పదిహేనేళ్ళు నడుస్తున్నాయని ఆమె అన్నారు. సింగపూర్‌లో అప్పీల్ చేయాలంటే తప్పనిసరిగా కొత్త ఆధారాలు సమర్పించాలని, పాత విషయమే మళ్ళీ తీసుకొచ్చి కాలయాపన చేయడానికి ఆ వ్యవస్థ అనుమతించదని ఆమె వివరించారు. దీని వల్ల కేసులు వేగంగా తేలుతున్నాయని, బాధితులకు సత్వరం న్యాయం దొరుకుతోందని అన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రిప్రజెంటేషన్ ఇవ్వాలని, అది దేశ న్యాయ వ్యవస్థలో పెద్ద సంస్కరణకు నాంది పలుకుతుందని ఆమె సూచించారు. ఈ అమూల్యమైన అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# విద్యార్థులకు యోగాభ్యాసన



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** ఉయ్యూరు శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు యోగాభ్యాస శిక్షణ నిర్వహించారు. స్పోకెన్ ఇంగ్లీషు, గ్రామర్ తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్ జె ప్రదీప్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కథల పుస్త కాలు చదివించి అందులో నీతిని సవివరంగా తెలియచేశారు. గ్రంథాలయ అధికారి బి రమణి, సిబ్బంది పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారినికి ఒక గ్రామం.. ఒకనెల




**ఉయ్యూరు,కలంకౌంటర్ :** గ్రామాలలో భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రారంభించిన ఒక గ్రామం ఒక నెల కార్యక్రమం రైతులు, భూయజమానులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం సురేశ్ కుమార్ అన్నారు. ఒక గ్రామం ఒకనెల కార్యక్రమంలో భాగంగా గురవారం ముదునూరులో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి నిర్వహించిన సదస్సును ఎంపీడీఓ శేషగిరిరావు, ఇతర కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, భూసమస్యల పరిష్కారానికి రైతులు, భూయజమానులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగనవసరం లేకుండా గ్రామంలోనే పరిష్కరించేందుకు నెలలో నాలుగు రో జుల పాటు ఒక గ్రామం ఒకనెల కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమం లో ప్రజల భూసమస్యలు నమోదుచేస్తామని, అసైన్డ్ భూములు, (22)ఏ జాబితాలో ఉన్న భూములు, సరిహద్దు తగాదాలు, సర్వే నంబర్లలో లోపాలు, కుటుంబ సభ్యుల మధ్య పంపకం సమస్యలు నమోదుచేస్తామని ఈ అవకాశం ప్రజలు సద్వినియోగం చేసు కోవాలన్నారు.

# గ్రామాల సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తాం

## -అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్







**మోపిదేవి,కలంకౌంటర్ :** గ్రామాల సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని మచిలీపట్టణం ఎంపీ వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గురువారం మోపిదేవి మండలం పెదకళ్లేపల్లిలో ఎంపీ, ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి కేటాయించిన ఎంపీ లాడ్స్ నిధులు రూ.50 లక్షలు, రాజ్యసభ సభ్యులు పరిమళ్ నత్వాని ఎంపీ లాడ్స్ ద్వారా కేటాయించిన రూ.50 లక్షలు మొత్తం రూ.కోటి నిధులతో అద్దంకి నాంచారమ్మ ఆలయం వద్ద నూతన కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి శిలా ఫలకం ఆవిష్కరించారు. పల్లె పండుగ 1.0 కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తమ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా మంజూరు చేసిన ఉపాధి హామీ పథకం నిధులు రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించిన 780 మీటర్ల మూడు సీసీ రోడ్లను ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించారు. పల్లె పండుగ 2.0 కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తమ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా మంజూరు చేసిన ఉపాధి హామీ పథకం నిధులు రూ.97 లక్షలతో మోపిదేవి - వెంకటాపురం మధ్య నూతనంగా నిర్మించిన 2.37 కిలోమీటర్ల తారు రోడ్డును మోపిదేవిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ రూ.కోటితో నిర్మిస్తున్న ఈ కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను గ్రామ పెద్దలు స్వీయ పర్యవేక్షణ, భాగస్వామ్యంతో స్వంత ఇంటి నిర్మాణంలా భావించి చేయించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో గ్రామాలకు పునరుజ్జీవం కలిగిందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉపాధి నిధులతో చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం ద్వారా రూ.36.65 కోట్లతో 46 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 15 కిలోమీటర్ల తారు రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పవన్ కళ్యాణ్ సాధించిన సాస్కి నిధులతో నియోజకవర్గంలో రూ.14.57 కోట్లతో 22 కిలోమీటర్లు తారు రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. రూ.5.04 కోట్లతో నియోజకవర్గంలో 14 నూతన గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. మరో 15 అసంపూర్తి గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను రూ.1.37 కోట్లతో పూర్తి చేస్తున్నట్లు వివరించారు. రానున్న కాలంలో మరిన్ని రోడ్లు మంజూరు సాధించి, నియోజకవర్గంలో అన్ని రోడ్లు అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, సీనియర్ నాయకులు బాల కోటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, పెదకళ్ళేపల్లి గ్రామ నివాసి క్లాస్ వన్ కాంట్రాక్టర్ బండారు మధుబాబు జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లికార్జునరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాధ్, ఎంపీడీఓ జంగం స్వర్ణభారతి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రావి రత్నగిరి, పంచాయతీరాజ్ డీఈఈ పగడాల సురేష్ బాబు, ఏఈ బొప్పన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యులు అరజా ఆశాదేవి, కొమ్ము పవన్, పీఏసీఎస్ చైర్మన్లు అరజా రాధిక, కోసూరు నాగమల్లేశ్వరరావు, యర్రంశెట్టి సుబ్బారావు, మాజీ సర్పంచులు అరజా సంధ్యారాణి, పొలిమెట్ల ఏసుబాబు, దిడ్ల జానకీ రాంబాబు, ఏఎంసీ డైరెక్టర్ మెరకనపల్లి నరేష్, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు కేతరాజు శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షులు గొర్రెపాటి నాగేశ్వరరావు, అవనిగడ్డ లంకమ్మ దేవస్థానం చైర్మన్ అన్నపరెడ్డి వెంకటస్వామి, సకలేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గవిరి శివరామకృష్ణ, వేణుగోపాలస్వామి దేవస్థానం చైర్మన్ అరజా బసవయ్య, అద్దంకి నాంచారమ్మ దేవాలయం అధ్యక్షులు గండు సాంబశివరావు, నాయకులు తోట కృష్ణాంజనేయులు, కొల్లి కిషోర్, కొల్లి మురళీ, రావి వసంతరావు, కోసూరు శివాజీ, అరజా కిరణ్ కాంత్, యడ్ల శ్రీనివాసరావు, యడ్లపల్లి లక్ష్మణరావు, బొందలపాటి కోటేశ్వరరావు, చందన రంగారావు, గోళ్ళ శ్రీనివాసరావు, బాదర్ల లోలాక్షుడు, తుర్లపాటి రామ్మోహనరావు, సోమి ప్రసాద్, గండు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# మాతృ సంరక్షణ కార్యక్రమం పై అవగాహన




**బంటుమిల్లి,కలంకౌంటర్ :** బంటుమిలి పట్టణంలోని స్త్రీ శక్తి భవనంలో వెలుగు డిఆర్డిఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ దశరధరం సారధ్యంలో గురువారం మాతృ సంరక్షణ పై అవగాహన కార్యక్రమం జరిగింది. బంటు మిల్లి ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి కే పవన్ కుమార్ ఆదేశాను సారశీ గ్రామ మైక్య సంఘం ప్రెసిడెంట్ ,అసిస్టెంట్లకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ ఈ ఓ శ్రీనివాస్ మాతృ సంరక్షణ కార్యక్రమం పై అవగాహనకల్పించడంతోపాటు అనేక విషయాలు తెలియజేసారు. ఈ అవగాహన కార్యక్రమంలో గర్భధారణ ముందు, గర్భవతిగా ఉన్నప్పుడు, ప్రసవ సమయంలో, పుట్టిన బిడ్డల విషయం లో తీసికోవలసిన జాగ్రత్తలు వేయించు కోవలసిన టీకాలు, తినవలసిన ఆహారం, వారికి ప్రభుత్వం ద్వారా లభించు సేవల వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు అమలేశ్వరి సుజని ఆశ వర్కర్లు పాల్గొన్నారు

# కొల్లి చక్రపాణి కి ఘనంగా నివాళులర్పించిన పార్టీ నాయకులు...





**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి లో మాజీ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ దివంగత కొల్లి చక్రపాణి 10 వ వర్ధంతి కార్యక్రమం తనయులు కొల్లి మురళి , గోపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ విచ్చేసి కొల్లి చక్రపాణి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మోపిదేవి మండలం లో కొల్లి చక్రపాణి తెలుగుదేశం పార్టీకి చేసిన విశేష కృషి పలు అభివృద్ధి కార్యక్రమాలు అందరూ కొనియాడారు. అనంతరం మోపిదేవి ప్రధాన సెంటర్ నందు కొల్లి చక్రపాణి జ్ఞాపకార్థం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి విచ్చేసే భక్తులకు మజ్జిగ పంపిణీ నిర్వహించారు. తర్వాత మాజీ ఉపసర్పంచ్ కోనేరు సుందర్ సింగ్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం నందు కొల్లి చక్రపాణి జ్ఞాపకార్థం పదివేల రూపాయలు విలువచేసే వాటర్ కూలింగ్ మిషన్ ను మోపిదేవి తాసిల్దార్ హరినాథ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి జడ్పిటిసి సభ్యులు మెడ బలిమి మల్లికార్జునరావు, దివి మార్కెట్ యార్డ్ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు పరుచూరి అంజయ్య నడకుదుటి జనార్దన్ రావు, తెలుగుదేశం పార్టీ నాయకులు నిడమానూరు దిలీప్, రావి రత్నగిరి మతి శ్రీనివాసరావు ,గొరిపత్తి జగన్మోహన్రావు, మోపిదేవి శ్రీనివాసరావు విశ్వంశెట్టి రాజా తదితరులు పాల్గొన్నారు.

# కాగిత కొండకు టీడీపీ నాయకులు పరామర్శ



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** కష్టకాలంలో పార్టీకొరకు పనిచేసిన వారికి పార్టీ అండగా ఉంటుందని టీడీపీ తోట్లవల్లూరు మండల నాయకుడు వీరపనేని శివరామ్ అన్నారు. అనారోగ్యానికి గురై స్థానిక హోప్ హాస్పిటల్ చికిత్స పొందుతున్న సర్దార్ గౌతులచ్చన్న సేవాసమితి అధ్యక్షుడు, రేషన్ డీలర్ల సంక్షేమం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాగిత కొండను శివరామ్, వల్లూరు కిరణ్ గురువారం పరామర్శించారు. ఈసందర్భంగా కొండ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ఆరాతీసి మెరుగైన వైద్యం అందించాలన్నారు. పార్టీ కష్టకాలంలో కొండా ఎంతో అండగా నిలి చారని, త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని ఆకాంక్షించారు.

# తమిళనాడులో గెలిచిన ఏకైక బీజేపీ పార్టీ ఎమ్మెల్యే ఇతనే..



**తమిళనాడు,కలంకౌంటర్ :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున గెలిచిన ఏకైక ఎమ్మెల్యే భోజరాజన్ ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమయ్యారు. ఉదగమండలం (ఊటీ) నియోజకవర్గంలో టీవీకే అభ్యర్థి ఇబ్రహీంపై కేవలం 976 ఓట్ల స్వల్ప మెజారిటీతో ఆయన విజయం సాధించారు. రాష్ట్రంలో పోటీ చేసిన 27 స్థానాల్లో బీజేపీకి దక్కిన ఏకైక సీటు ఇదే. ప్రస్తుతం గవర్నర్ నిర్ణయాల చుట్టూ జరుగుతున్న రాజకీయ రగడతో ఈ 'ఒక్కగానొక్క' ఎమ్మెల్యే పై అందరి దృష్టి పడింది.

# మహాసభ బిల్డింగ్ కమిటీ చైర్మన్ పెనుగొండ దంపతులకు సన్మానం





**విజయవాడ,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ్ అధ్యక్షురాలు కొప్పురావూరి రజని , ప్రధాన కార్యదర్శి అన్నం సాయి సునీత, ఆర్యవైశ్య మహాసభ బిల్డింగ్ కమిటీ చైర్మన్ పెనుగొండ సుబ్బరాయుడు , వారి సతీమణి ఉషారాణి ని మర్యాదపూర్వకంగా కలిసి వారిరువురిని సత్కరించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న మహాసభ భవనం గురించి చర్చించారు.

# భారీ కంపెనీలకు అనుబంధ పరిశ్రమలుగా ఎంఎస్ఎంఈలు

● పారిశ్రామికాభివృద్ధి ఎకో సిస్టంలో ఎంఎస్ఈలు కీలకం ● వైద్య ఖర్చులు తగ్గాలి... విద్యుత్ భారం తగ్గాలి ● అసంఘటిత కార్మికులకూ నైపుణ్య శిక్షణ ● బెస్ట్ పాలసీలకు మెంటార్లుగా జిల్లా కలెక్టర్లు ● 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు




**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో ఏర్పడే భారీ పరిశ్రమలకు అనుబంధ రంగాల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలకు అవకాశం ఉందని... వీటికి ఎంఎస్ఎంఈ రంగంలో ప్రోత్సాహం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. రాష్ట్రానికి భారీ పరిశ్రమలు వస్తున్న సందర్భంలో ఏర్పడే ఎకో సిస్టంలో ఎంఎస్ఎంఈలు కీలక పాత్ర పోషించేలా చూడాలని ఆదేశించారు. రెండు రోజుల పాటు రాష్ట్ర సచివాలయంలో జరిగే 7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో భాగంగా తొలి రోజైన గురువారం నాడు వివిధ శాఖల పనితీరు మీద.. క్షేత్ర స్థాయిలో అమలు విధానంపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. దీంట్లో భాగంగా విద్య, వైద్యం, పెట్టుబడుల గ్రౌండింగ్ వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన సంస్థలకు భూ కేటాయింపులు వంటి విషయాల్లో ఏమైనా ఇబ్బందులుంటే వాటిని వెంటనే పరిష్కరించాలి. 22ఏ పరిధిలో ఉన్న ఏపీఐఐసీ భూములను నిషేధిత జాబితా నుంచి తప్పించాలి. రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీల ద్వారా నిషేధిత భూములను క్లియర్ చేయాలి. జిల్లాల్లోని వివిధ ఉత్పత్తులు పాన్ ఇండియా, గ్లోబల్ బ్రాండ్స్ కావాలి. అరకు కాఫీ లాంటి బ్రాండింగ్ ఏపీ ఉత్పత్తులకు రావాలి. మనం రోజూ వారీగా వినియోగించే చాలా ఉత్పత్తుల కొనుగోలు ద్వారా విదేశాలకు డబ్బులు చెల్లిస్తున్నాం. ఏపీ ఉత్పత్తులకు క్వాలిటీ, బ్రాండింగ్ వంటివి వస్తే ఆ ఆదాయం మనకే వస్తుంది. పారిశ్రామిక పార్కులు, ఉత్పత్తి యూనిట్ల వద్ద ఎంఎస్ఎంఈ ఎకోసిస్టమ్ అభివృద్ధి కావాలి. భారీ పరిశ్రమలకు అనుబంధ పరిశ్రమలుగా ఎంఎస్ఎంఈలు అభివృద్ధి కావాలి. గూగుల్ క్లౌడ్ ఏఐ హబ్ ఏపీకి రావడంతో క్యారియర్ ఏసీ సంస్థ రాష్ట్రానికి వచ్చింది. డేటా సెంటర్లకు, క్వాంటం కంప్యూటింగ్ వంటి వ్యవస్థలకు బల్క్ చిల్లర్స్ ను ఏపీకి వచ్చిన ఏసీ సంస్థలే సరఫరా చేస్తాయి. అమరావతిలో క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీ ఏర్పాటు అయ్యింది. క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ పని చేయటం ప్రారంభిస్తే వాటికి కావాల్సిన పరికరాల ఉత్పత్తి కూడా చేసేలా ఎకోసిస్టమ్ వస్తుంది. ఈ విధంగా అభివృద్ధి చెందే ఎకో సిస్టంలో ఎంఎస్ఎంఈలు కీలకంగా ఉండాలి."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించేలా ప్రణాళికలు..** "రాష్ట్రంలో 15 లేబర్ అడ్డాలు నిర్మిస్తున్నాం. కార్మికులు పని కోసం రోడ్ల మీద వేచి ఉండకుండా... లేబర్ అడ్డాల్లో కూర్చొంటారు. పని లేని సమయంలో కార్మికులకు స్కిల్ డెవలప్మెంటులో శిక్షణ ఇస్తాం. ఇక ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా వారిలో ఆరోగ్య అవగాహన కల్పించాలి. ప్రీవెంటివ్ హెల్త్ సక్సెస్ అయితే ప్రజలకు వైద్య ఖర్చులు కూడా తగ్గుతాయి. జిల్లాల వారీగా హెల్త్ స్కోర్ లు తయారు చేయాలి. సోలార్ రూఫ్ టాప్, కుసుమ్ స్కీంలను ఇంటిగ్రేట్ చేసి ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలపై సౌర విద్యుత్ ఉత్పత్తి చేయాలి. అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలు, పాఠశాలలు, కళాశాలలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలి. రానున్న కాలంలో విద్యుత్ నిమిత్తం ఒక్క పైసా కూడా ఖర్చు చేయాల్సిన అవసరం రానంతగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద సోలార్ పవర్ ఉత్పత్తి జరగాలి. 22 లక్షల పంపు సెట్లకు పీఎం కుసుమ్ ద్వారా సోలార్ పవర్ పెట్టుకుంటే మంచి ప్రయోజనం ఉంటుంది. బెస్ట్ ప్రాక్టీసెస్ కు మెంటార్లుగా జిల్లాల కలెక్టర్లను నియమిస్తాం. స్కూళ్లల్లో స్మార్ట్ కిచెన్ మెంటార్ గా కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఉంటారు. లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించాలి... అప్పుడు మరింతగా అభివృద్ధి సాధించగలం. రైలు మార్గం ద్వారా ప్రతీ కిలోమీటరుకు రూ. 1.83 వ్యయం అవుతోంది. రహదారి మార్గంలో జరిగే రవాణాపై రూ.3.40 ఖర్చు చేయాల్సి వస్తోంది. రవాణా వ్యయం గణనీయంగా తగ్గితేనే ఏపీకి గరిష్టంగా ప్రయోజనం కలుగుతుంది. పారిశ్రామిక పార్కులకు రోడ్, రైల్ కనెక్టివిటీ పెరగాలి.

# ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారులుగా కౌటికే విఠల్ నియామకం







**హైదరాబాద్,కలంకౌంటర్ :** ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారులుగా ప్రముఖ చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ సలహాదారు, సేవా కార్యక్రమాల నిర్వాహకుడు కౌటికే విఠల్ ని సంస్థ గ్లోబల్ చైర్మన్ టీ.జీ. వెంకటేష్ ప్రత్యేక సమావేశంలో నియమించారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడిన టీ.జీ. వెంకటేష్ , కౌటికే విఠల్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. వారు ఎన్నో సంవత్సరాలుగా భారతదేశంలో చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ సలహాదారులలో అగ్రస్థానంలో కొనసాగుతున్నారని తెలిపారు. తమ పాలసీదారుల జన్మదినోత్సవాల సందర్భంగా ప్రతి సంవత్సరం వెయ్యిమందికి ఉచిత అన్నదానం నిర్వహించడం, చలికాలంలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం, ఎండాకాలంలో వేలాది మందికి ఉచితంగా నీటి బాటిళ్లు అందించడం వంటి అనేక సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో విశేష గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఇలాంటి సేవాభావం, నాయకత్వ లక్షణాలు, సమాజపట్ల అంకితభావాన్ని గుర్తించి ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారులుగా నియమించినట్లు తెలిపారు. సభలోని సభ్యుల కరతాళ ధ్వనుల మధ్య టీజీ వెంకటేష్ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం కౌటికే విఠల్ మాట్లాడుతూ, తాను ప్రపంచ ఆర్య వైశ్య మహాసభలో చేరి ఆరు సంవత్సరాలు పూర్తయ్యాయని తెలిపారు. మొదటి రెండు సంవత్సరాలు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అనంతరం నాలుగు సంవత్సరాలు జాతీయ సలహాదారుగా సేవలందించిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయంలో చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలను వివరించారు. జాతీయ సలహాదారుగా దేశవ్యాప్తంగా నిర్వహించిన సేవా కార్యక్రమాల గురించి క్లుప్తంగా వివరించారు. సభకు అధ్యక్షత వహించిన అడ్వకేట్ మదుపల్లి రవి గుప్త మాట్లాడుతూ, కౌటికే



విఠల్ గారు పట్టుదల, కార్యదక్షతకు ప్రతీక అని అన్నారు.

# మజ్జిగ పంపిణీ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఉదయపు నడక మిత్రమండలి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు .ఈరోజు మజ్జిగ దాత రావి నాగశివరావు . ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జల్లు మురళి నాథ్ ట్రెజరర్ వేదా లక్ష్మీనరసింహం కాంచనపల్లి కృష్ణమోహన్రావు నాంచారయ్య భద్రం తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ చిలుకు స్వామికి ఘన సత్కారం




**హైదరాబాద్,కలంకౌంటర్ :** సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్ కు తెలంగాణా ప్రభుత్వ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా' శ్రమ శక్తి ' అందుకొన్న సందర్భంగా డాక్టర్ చిలుకు స్వామి ని సౌత్ సెంట్రల్ రైల్వేఅజ్దూర్ యూనియన్ , ఆల్ ఇండియా పెన్షనర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. జనరల్ సెక్రటరి యుగంధర్, స్వామి సేవలను కొనియాడారు. ఎలక్ట్రికల్ బ్రాంచ్ సభ్యులు పి బి ఎన్ ప్రసాద్, జెడ్ ఆర్ యూ సీ సీ మెంబెర్ నూర్ డాక్టర్ స్వామి కి అభినందనలు తెలిపారు. అరుణ్ కుమార్, బాబు రావు ఉదయ్ రాయ్ తదితరులుఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పెనుగొండ పీఠాధిపతి ఆశీస్సులు









**మచిలీపట్నం,కలంకౌంటర్ :** పెనుగొండ పీఠాధిపతి బాల స్వామీజీ గురువారం కలం కౌంటర్ దినపత్రిక రవికుమార్ నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా కొద్దిసేపు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ మున్సిపల్ చైర్మన్ మోట మర్రి బాబా ప్రసాద్, సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, స్టేట్ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి వి ఫణి కుమార్ , కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సన్నిధి సాయి శ్రీనివాస్,శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఉపాధ్యక్షుడు సామా కాంతారావు, అన్నం బాబురావు,వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జల్లు మురళీ , కంతేటి శివరావు తదితరులు స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. కలం కౌంటర్ దినపత్రిక రవికుమార్ కుమారుడు చిట్టా జిగ్నేష్ కు పంచెలు ఇచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని బాల స్వామీజీ ఆశీస్సులు అందించారు.





Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com